ప్రజాశక్తి

ఆదివారం 20 అక్టోబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



సజ్జ కంకులను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా, మంత్రి స్వామి

నష్టపరిహారం ఇచ్చి..

రైతులను ఆదుకుంటాం..

- మంత్రి శ్రీ డోలా బాలవీరాంజనేయస్వామి
- వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-పొదిలి

తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి.. ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం ఆయన మండలంలోని కొండాయపాలెంలో ఇటీవల తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన సజ్జ పంటను కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. సజ్జ పంట పూర్తిగా తడిసి మొలకలు వచ్చి రంగు మారిన వైనాన్ని అధికారులు రైతులు మంత్రికి వివరించారు. మొలక వచ్చిన సజ్జ కంకులను వారు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఒక వారం రోజుల్లో పంట చేతికి వస్తుండగా అనుకోకుండా వచ్చిన తుపాను ప్రభావంతో గ్రామంలో పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. ఎకరాకు రూ.10 వేల పెట్టుబడులు పెట్టి తీరా కోత సమయానికి పూర్తిగా నష్టపోయామని రైతులు వారికి వివరించారు. పొదిలి మండలంలో సుమారు వెయ్యి ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు వివరించారు. వర్షానికి బాగా తడిసి మొలక రావడంతో గింజలు రంగు మారి విషపూరితమవుతుందని, కొనుగోలుకు పనికిరావన్నారు. ప్రభుత్వం మసక బారి రంగు మారిన పంటను మార్క్‌ఫెడ్ ▶ 3లో

మా వాటా ఇవ్వాల్సిందే.!

- మద్యం దుకాణాల్లో 20 నుంచి 30 శాతం అడుగుతున్న ఎమ్మెల్యేలు
- ముడుపుల దెబ్బకు అధిక ధరలకు అమ్ముతున్న వ్యాపారులు
- సిఎం చెప్పిన క్వార్టర్ రూ.99 ధర అమలు కాని వైనం..



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'మా వాటా మాకు ఇవ్వాల్సిందే.. లేకుంటే ఎలా దుకాణాలు నడుపుతారో చూస్తాం' అంటూ కొందరు ఎమ్మెల్యేలు మద్యం దుకా ణాల వ్యాపారులకు హుకుం జారీ చేశారు. ఇప్పుడే దుకాణాలు పెడుతున్నందున ఎమ్మె ల్యేల వాటా రేపోమాపో ఆలోచించక తప్పదం టున్నారు. వ్యాపారుల్లో ఇప్పుడు ఇదే పెద్ద గుబులుగా మారింది. రూ.లక్షలు ఖర్చుపెట్టి దుకాణాలు దక్కించుకుంటే అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం వడ్డీలకు కూడా సరి పోతుందా? లేదా? అన్న సంశయనంలో చాలా మంది ఉన్నారు. కొందరు ఇప్పుడున్న ఆంక్ష లతో నడపడం కష్టమనే భావనతో అమ్ముకుం టున్నారు. సిండికేట్లకు ఇచ్చేస్తున్నారు. అందరికీ వాటాలు ఇవ్వాలంటే అధిక ధరలకు అమ్మడం తప్ప మార్గం లేదనే నిర్ణయానికి వచ్చేశారు. సీసాపై రూ.20 నుంచి రూ.30 అధికంగా అమ్ముతున్నారు. అలా అమ్మకపోతే దివాళా తీస్తామని వ్యాపారులు బహిరంగంగానే చెబుతున్నారు.

మద్యం దుకాణాల్లో గానీ, లాభంలో గానీ ఎలాగైనా కానీ కనీసం 20 నుంచి 30శాతం వాటా ఇవ్వాలని పాలపక్ష ఎమ్మెల్యేలు కొందరు పట్టుబడుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గం లోని వ్యాపారులకు చెప్పేశారు. నిన్న జరిగిన పార్టీ సమావేశంలో సిఎం చంద్రబాబు గట్టిగా హెచ్చరికలు కూడా జారీచేశారు. లిక్కర్, ఇసుకలో జోక్యం చేసుకోవద్దంటూ హెచ్చరిం చారు. ఈ ప్రకటనతో ఎమ్మెల్యేలు వాటాల విషయంలో ఏమైనా వెనక్కు తగ్గుతారా? అనే చర్చ దుకాణాల నిర్వాహకుల్లో వినిపిస్తోంది. అయితే సిఎం చంద్రబాబు మద్యం వ్యాపారం చేయవద్దని సూచించారే తప్ప దుకాణాల్లో నుంచి వాటాలు కాదనే విషయం తెరపైకి తెస్తున్నారు. ఏదేమైనా దుకాణాల నుంచి ఎవరైనా ఇవ్వక తప్పదనే సంకేతాలిచ్చారు. ఎందుకంటే అందరూ పార్టీ కార్యకర్తలే దుకాణాలను దక్కించుకున్నారు. మీ గెలుపు కోసం కృషి చేసినా ఉపయోగం లేదనే చర్చ కార్యకర్తల్లో ఉంది. మండ లాల్లో సిండికేట్‌గా మారినా అందరూ తెలుగుదేశం కార్యకర్తలే వ్యాపారులుగా ఉన్నారు. ఎమ్మెల్యేలు కొందరు తమ అనుచరులకు దుకాణాలు దక్కేలా చేశారు. అధికారులను, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఈ పని చేయగలిగారు. కొందరు ఎమ్మె ల్యేలు మాత్రం తమ పార్టీ కార్యకర్తలు, తమ పార్టీ వ్యాపారులకు దాదాపుగా అన్ని దుకాణాలు వచ్చేలా చక్రం తిప్పారు. వైసిపి నుంచి దుకాణాల కోసం ధరఖాస్తులు పెట్ట కుండా తెరచాటున అన్ని రకాలుగా వ్యవహారం నడిపారు. ఇంతవరకూ చేయగలిగారు. అందుకే వాటాలు ఇవ్వాల్సిందేనా? అనే చర్చ నడుస్తోంది. 90 శాతం దుకాణాలు తెలుగు దేశం నేతలకే దక్కాయి. దుకాణాల కోసం ఒక్కొక్కరూ పదుల సంఖ్యలో దరఖాస్తులు పెట్టారు. గతంలో మద్యం వ్యాపారంలో అను భవం ఉన్న ఓ యువ నేత 200 దరఖాస్తులు పలుచోట్ల వేసినట్లు సమాచారం. సిండికేట్‌గా మార్చినందున అందరూ ఎంతో కొంత లబ్ధి పొందారు. నడపలేని వాళ్ల ఇతరులకు అప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే లకు, అధికారులకు వాటాలు ఇవ్వాల్సినందున అనివార్యంగా అధిక ధరలకు ▶ 3లో

జిల్లాలో జోరువాన

- శింగరాయకొండలో పాలేరు-బిట్రగుంట సప్లయి ఛానల్‌కు గండి
- బైరేగి మాన్యంలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



అప్పపురం గిరిజన కాలనీలో ఇంట్లోకీ నీరు

ప్రజాశక్తి-ఒంగోలు, శింగరాయకొండ

ప్రకాశం జిల్లాలో శుక్రవారం నాడు భారీవర్షం కురిసింది. ఉదయం ఎడతెరిపి లేని వానతో జనజీవనం స్తంభించింది. శింగరాయకొండలో ఆదివారం నాడు భారీ వర్షం నమోదయింది. తెల్లవారుజాము నుంచి మొదలైన వర్షం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా భారీగా వర్షం పడింది. శింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి గ్రామ పంచాయతీలోని తిరుమల పట్టాభినగర్ అప్పాపురంలో వర్షపు నీరు కాలనీలోకి చేరింది. అప్పాపురంలోని గిరిజన కాలనీలోకి నీరు భారీగా చేరడంతో గిరిజనులు ఇళ్లలో నుంచి బయటికి వచ్చే పరిస్థితి కూడా కనిపించలేదు.

శింగరాయకొండ గ్రామ పంచాయతీ లోని బైరాగి మాన్యంలో డ్రైనేజీలు, కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరాయి. భారీగా వర్షం రావడం వల్ల రోడ్లు మొత్తం జలమయంగా మారిపోయాయి. ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా నిండిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వర్షపు నీటితో నిండిపోయింది. శనివారం నాడు కురిసిన ఈ భారీ వర్షానికి చెరువులకు పూర్తిస్థాయిలో వర్షపు నీరు చేరింది.



గండిని పూడ్చేస్తున్న రైతులు

సప్లయి ఛానల్‌కు గండి

శింగరాయకొండ మండలం, బింగినపల్లి దగ్గర పాలేరు-బిట్రగుంట స్కీమ్ సప్లయి ఛానల్‌కి గండి పడింది. తీర ప్రాంత ప్రజలకు సాగునీటి అవసరాల కోసం ▶ 2లో

వెలి వేశారని.!

- టిడిపి కార్యకర్త ఆత్మహత్య
- వైసిపి నేతలే కారణమని సూసైడ్ నోట్



ఆత్మహత్య చేసుకున్న బుజ్జిరెడ్డి (ఫైల్)

ప్రజాశక్తి-చీరాల

తనను, తమ కుటుంబాన్ని వైసిపి నేతలు వెలి వేశారని ఓ టిడిపి కార్యకర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చీరాల మండలం, కావూరివారిపాలెంలో శనివారం జరిగింది. తన మరణానికి వైసీపీ నేతల వేధింపులే కారణమని సూసైడ్ లెటర్ రాసి పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం, కావూరివారిపాలెంకు చెందిన కోట బుజ్జిరెడ్డి (50) టిడిపి కార్యకర్త. అదే గ్రామానికి చెందిన కొందరు వైసిపి నేతలు ఇతడు టిడిపి అనే కారణంతో గతంలో 40 రోజుల పాటు గ్రామంలో బహిష్కరించారు. గ్రామంలో ఇతనితో గానీ, ఇతని కుటుంబసభ్యులతో గానీ మాట్లాడినా, ఇంటి ముందు వెళ్లినా వారికి రూ.50 వేల జరిమానా విధిస్తామని గ్రామ ప్రజలతో చెప్పారు. కొద్దిరోజుల క్రితం బుజ్జిరెడ్డి మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో తన సమస్యను తెలిపేందుకు వెళ్లి కార్యాలయం ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించగా అక్కడ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు.

కొద్ది రోజుల అనంతరం కోలుకొని గ్రామానికి చేరుకున్న బుచ్చిరెడ్డి చిల్లర కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అతని కొట్టుకు ఎవరు వెళ్లకూడదని, వారితో మాట్లాడకూడదని అలా ఎవరైనా చేస్తే వారికీ రూ.50 వేల జరిమానా వేస్తామని వైసిపి నాయకులు హుకుం జారీ చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బుచ్చిరెడ్డి సూసైడ్ లెటర్ రాసి.. ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చీరాల డిఎస్పీ జగదీష్ నాయక్, సిఐ శేషగిరిరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

అండగా ఉంటా..: ఎమ్మెల్యే

టిడిపి కార్యకర్త కోట బుజ్జిరెడ్డి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ▶ 2లో

జిల్లాలో జోరువాన

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పి.బి స్కీం సప్లయి ఛానల్ ద్వారా నీటిని బింగినపల్లి, పెద్దన్న పాలెం రైతులకు సాగునీటి కోసం చెరువు నింపుకునేందుకు సప్లయి ఛానల్ నిర్మించారు. గత పాలకుల పర్యవేక్షణ లోపం కారణంగా చిన్నపాటి వర్షానికే గండి పడింది. శనివారం కురిసిన వర్షం ప్రభావంతో నీటి ప్రవాహం ఎక్కువగా వచ్చింది. దానితో పాలేరు–బిట్రగుంట సప్లయి ఛానల్ బింగినపల్లి చెరువుకు నీరు చేరే సమీపంలో ఛానల్‌కి గండిపడి నీరు వృథా కావడంతో ఆ గ్రామాల రైతులు చొరవ తీసుకొని ఇసుక బస్తాలతో గండిని పూడ్చుకున్నారు. దీంతో వృథా అవుతున్న నీటిని స్థానిక రైతులు బింగినపల్లి చెరువుకు మళ్లించారు. చెరువుకు నీరు చేరుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి పాలేరు–బిట్రగుంట స్కీం సప్లయి ఛానల్‌పై దృష్టి పెట్టి నీటి పారుదల సక్రమంగా జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గండిని పూడ్చే కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధి సన్నెబోయిన మాలకొండయ్య, బింగినపల్లి గ్రామ అధ్యక్షులు పూడి రోసిరెడ్డి, నూకసాని శివకోటయ్య, నూకసాని వెంకటేశ్వర్లు, నూకసాని సుధాకర్, నూకసాని రాకేష్, బక్క రమణారెడ్డి, అల్లాడి ఏడుకొండలు, గుమ్మడి వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, కోమట్ల రాంప్రసాద్, కోమట్ల శ్రీనివాసులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-దర్శి

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం దర్శి మండలంలోని త్రిపుర సుందరిపురం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్, మురుగు కాలువ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కనిగిరి డిఎల్‌డిఓ శ్రీనివాస రెడ్డి, ఎంపిడిఓ ఎల్ కృష్ణమూర్తి, పిఓఆర్‌డి ఇఓ ఎ సుధాకర్ రావు, పంచాయతీ కార్యదర్శులు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెలి వేశారని..

(మొదటిపేజీ తరువాయి)

అన్నివేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తమ నేతల ద్వారా బుజ్జిరెడ్డి కుటుంబసభ్యులకు తెలియజేశారు. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశానుసారంగా కుటుంబసభ్యులను టిడిపి నేతలు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు కొత్తవరపు జనార్ధన్, గంజి పురుషోత్తం, తెల్లప్రోలు నాగేశ్వరావు, ఉసురుపాటి సురేష్, వెంకటేష్, డేటా నాగేశ్వరావు ఉన్నారు.

వాగును తలపిస్తున్న పెదారికట్ల రోడ్లు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని పెదారికట్లలో అంతర్గత రోడ్లు వర్షాలకు నీరు చేరి వాగును తలపిస్తున్నాయి. పెదారికట్ల బస్టాండ్ నుంచి ఇరుసలగుండం రోడ్డుపై వర్షం నీరు చేరి వాగును తలపిస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. చెన్నకేశవస్వామి ఆలయ సమీప రోడ్డు కూడా అధ్వానంగా మారింది. వారిపల్లి పోయే రహదారి వర్షపు నీరు చేరి ఛిద్రం అయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారు లు స్పందించి వర్షపు నీరు పోయే వీలుగా కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు అభ్యర్థిస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అర్బన్ హెల్త్ సెంటర్లల్లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేసే ఉద్యోగులు స్టాఫ్ నర్స్, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ అధ్యక్షుడు కె.హనుమంతరావు అధ్యక్షతన సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కాలం సుబ్బారావు మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. సుదీర్ఘ కాలం నుండి పనిచేస్తున్నా వేతనాలు పెంచక పోవడం దుర్మార్గమని విమర్శించారు. పెరుగుతున్న విద్య, వైద్య ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలను పరిగణనలోకి తీసుకొని వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సుబ్బారావు

సమావేశంలో ఉద్యోగులకి పని భారం పెరుగుతుందని, పనిభారం తగ్గించాలని, కనీస వేతనం అమలు చేయాలని, మినిమం టైమ్ స్కేల్‌ని అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ భర్తీ చేసే ఉద్యోగాలలో అర్బన్ హెల్త్ సెంటర్లో పనిచేసే వారికి వెయిటేజ్ ఇవ్వాలని, బదిలీ సౌకర్యం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని తీర్మానించారు.

అర్బన్ పిహెచ్‌సి ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా కె.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శిగా కె.సురేంద్ర, కోశాధికారి ఎస్‌కె కాజావలి ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ.సుధాకర్, ఉపాధ్యక్షులుగా నిర్మల కుమారి, వాసవి, ఆంజనేయులు, కార్యదర్శులుగా జి.శ్రీనివాసరావు, సుభాషిణి, జి.రామారావు, ఏ.ఆంజనేయులు ఎన్నికయ్యారు. సమావేశానికి జిల్లాలోని 19 అర్బన్ హెల్త్ సెంటర్ల నుంచి స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్స్ హాజరయ్యారు.

గుండ్లకమ్మలో గల్లంతైన..

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-మద్దిపాడు

గుండ్లకమ్మలో గల్లంతయిన యువకుడి మృతదేహం శనివారం లభ్యం అయింది. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని రాచవారిపాలెం గ్రామానికి చెందిన గంగిశెట్టి బ్రహ్మనాయుడు ఈనెల 17వ తేదీన స్నేహితులతో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లి ఈత కొట్టేందుకు గుండ్లకమ్మలోకి దిగగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొట్టుకు పోయాడు. దీంతో రెండు రోజుల నుంచి అధికారులు రెస్క్యూ టీమ్‌తో గాలిస్తుండగా మృతదేహం లభ్యమయింది. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆలయంలో గుడి గంటలు చోరీ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండల కేంద్రమైన పుల్లలచెరువు పట్టణ సమీపంలోని చౌటపల్లి ప్రసన్న అంజనేయ స్వామి ఆలయంలో గుడి గంటలు చోరీకి గురయ్యాయి. శనివారం ఆంజనేయ స్వామి గుడికి వెళ్లి తలుపులు తెరిచి చూడగా గుడిలో గంటలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ జరిగినట్లు గుర్తించినట్లు ఆలయ పూజారి కె.ఉమామహేశ్వరశర్మ తెలిపారు. గుడికి ఉత్తర ద్వారం వైపు ఉన్న గడియ పగుల గొట్టి లోనికి ప్రవేశించి ఒక పెద్ద గంట, దాదాపు ముప్పై చిన్నగంటలు అపహరించినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ. 30 వేలు ఉంటుందన్నారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ పూజారి కె.ఉమామహేశ్వర శర్మ తెలిపారు.

సిఎం దృష్టికి కళాకారుల సమస్యలు

వరద బాధితులకు రూ.4 లక్షల విరాళం

కళాకారుల సంఘ ఉపాధ్యక్షురాలు దుర్గ



మాట్లాడుతున్న బోను దుర్గ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళినట్లు అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు బోను దుర్గ తెలిపారు. శనివారం సంఘ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల సహాయార్థం అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.4 లక్షల విరాళాన్ని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు ఆధ్వర్యంలో, మంగళగిరి టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేశామన్నారు. గత నెలలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం నిర్వహించిన కళా ప్రదర్శనలకు దాతల నుంచి సేకరించిన రూ.2 లక్షలు, పద్మశ్రీ ఎడ్ల గోపాలరావు రూ.2 లక్షలు మొత్తం నాలుగు లక్షల రూపాయలు అందించామన్నారు. కార్యక్రమానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో కళాకారులు పడుతున్న కష్టాలు, వారికి అందవలసిన బెనిఫిట్స్‌పై సిఎంకు వివరించామన్నారు. గత ప్రభుత్వంలో చింతామణి నాటకాన్ని ఒంటెద్దు పోకడతో నిషేధించారని, యధావిధిగా నాటకం ప్రదర్శనలు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాని సిఎంను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు శ్రీమతి గంట మంగా దేవి, అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనుంజయ రావు, కార్యదర్శి రౌతు వాసుదేవ్, మువ్వల వెంకటరమణ, బొంగు భాస్కర్, మిమిక్రీ శివ, గంటా సూర్యనారాయణ, ఎడ్ల గోపాలరావు జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, గాయనిలు ఏల్చూరి అనంతలక్ష్మి, తాళ్లూరు శ్రీదేవి, చల్లా నాగేశ్వరమ్మ, ధేనువకొండ సుబ్బయ్య పాల్గొన్నారు.

మా వాటా ఇవ్వాల్సిందే.!

(మొదటిపేజీ తరువాయి)

అమ్ముతున్నారు. ప్రారంభం నుంచే ధరలు పెంచారు. సిఎం చంద్రబాబు చెప్పిన క్వార్టర్ రూ.99 ధర ఎక్కడా అమలు కావడం లేదు. రూ.150 ధర ఉన్న సీసాను రూ.180కు విక్రయిస్తున్నారు. మద్యం కొత్త విధానం అంటూ ప్రైవేటు వారికి అప్పగించడంతో ఇదోతరహా మాఫియాగా మారుతోంది. అందరూ మద్యం అమ్ముకునే లాభాలు, ఆదాయాలు చూసుకోవాల్సినందున పేదల కష్టం దోచుకోవడమే ఎజెండాగా కనిపిస్తోంది. వ్యాపారులు ముందు కోట్లాది రూపాయలు ఫీజుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించారు. రేపు వాటిని మద్యం అమ్ముకొని సంపాదించుకోవాల్సిందే.. అంటే పేదలు కొనే మద్యం నుంచే రాబట్టుకోవాలి. పేదలు కష్టపడి కూలీనాలీ చేసుకుని సంపాదించుకునే డబ్బంతా మద్యానికే పోతోంది. కుటుంబాలూ గుల్లవుతున్నాయి. ఆరోగ్యాలు పోతున్నాయి. మద్యం పాలసీ కూడా కొత్త సీసాలో పాతసారా అన్నట్లుగానే తయారైంది.

మెట్లపై నుంచి జారిపడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్

ఇంటి ఆవరణంలో ఉన్న చెట్టు పూలను కోస్తూ ప్రమాదవశాత్తు కింద పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గొట్టిపడియలో చోటుచేసుకుంది. మార్కాపురం గ్రామీణ పోలీసులు తెలిపిన వివరములు ప్రకారం.. గ్రామానికి చెందిన బంగారు సుబ్బమ్మ (73) శుక్రవారం సాయంత్రం తన ఇంటి ఆవరణంలో ఉన్న సన్నజాజి పూల చెట్టుకు ఉన్న పువ్వులను మెట్టు ఎక్కి కోస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడింది. తలకు బలమైన గాయం అయ్యింది. స్థానికులు 108 అంబులెన్స్‌లో మార్కాపురం సర్వజన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఎస్ఐ అంకమ్మరావు సుబ్బమ్మ మృతదేహాన్ని పరిశీలించారు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి.. రైతులను ఆదుకుంటాం..

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా కొనుగోలుకు ప్రయత్నిస్తామని మంత్రి రైతులకు వివరించారు. ఎకరాకు సుమారు 25 నుండి 30 వేల రూపాయలు నష్టపోయినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సజ్జ పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి కేబినేట్‌లో చర్చించి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. వర్షాలతో పొగాకు పంట పూర్తిగా పాలిపోయి నష్టపోయినట్లు రైతులు మంత్రికి, కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ తమీమ్‌అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో వరద ప్రభావంతో ఇప్పటి వరకు ప్రాథమికంగా 3750 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు తెలిపారు. సుమారు 2500 మంది రైతులు పంటలు నష్టపోయినట్లు పేర్కొన్నారు. వీటిలో కంది సజ్జ, పొగాకు, వరి పంటలతో పాటు ఉద్యానవన పంటలైన బొప్పాయి, మిరప ఉన్నాయని పూర్తి పంట నష్ట పరిహారం వివరాలను అధికారులు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సుమారు 250 నుండి 350 కోట్ల పంట నష్టం జరిగినట్లు అంచనా ఉందన్నారు. నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పొగాకు పంట నష్టపరిహారం విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో పంట నష్టం తీవ్రంగా ఉందని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, మంత్రి దష్టికి తీసుకెళ్లామని తెలిపారు. త్వరలో రైతులందరికీ పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వ వైపు నుంచి చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిఎస్ శ్రీనివాసరావు, డిడిఎ సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి గోపీచంద్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహశీల్దార్ ఎంవి.కష్ణారెడ్డి, ఎంపీడీవో శోభన్‌బాబు, దర్శి ఏడిఏ బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి ఎస్కే జైనులాబ్దిన్, మండల ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ విజయ్ కుమార్

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-దొనకొండ

తోటి రైతులకు పొలంలో సహాయం చేసేందుకు వెళ్లిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన మండలంలోని చందవరం గ్రామపొలాల్లో చోటు చేసుకుంది. ఎస్ఐ కె.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చందవరం గ్రామానికి చెందిన తేలిక నాగార్జున(26) స్థానిక సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ ఎడ్జ్ ఫీజులు వేయాలని అడగడంతో పొలంలో ఫీజు వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగార్జున గ్రామంలో సౌమ్యుడుగా అందరికీ చేదోడు వాదోడుగా ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. బంధువులు విలపిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టింది. ఎస్ఐ విజయ్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబానికి నష్టప రిహారం అందేలా చూస్తామని విద్యుత్ ఏఈ నాగూర్‌వలి తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-దొనకొండ



గాయాలతో పడి ఉన్న సంతమ్మ

లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం దొనకొండ మండలం లోని కొచ్చెర్లకోటలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొచ్చెర్లకోట ఎస్సీ పాలేనికి చెందిన చీరాల సంతమ్మ (55) తనకు ఎవరూ లేకపోవటంతో ఒంటరిగా జీవిస్తోంది. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో స్థానిక వైద్యుని దగ్గరకు వెళ్లి చూపించుకుని వస్తుండగా పల్నాడు జిల్లా మాచర్ల నుంచి దొనకొండకు సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ ఆమెను ఢీకొనటంతో తీవ్ర గాయాలపాలైంది. గ్రామస్తులు ఆమెను మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రభుత్వ వైద్య శాలకు తీసుకెళ్లగా వైద్యులు ఆమెను పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ కె.విజయ్‌కుమార్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి



మృతి చెందిన కానిస్టేబుల్ సుభాని

మండలంలోని చీమల మర్రి సమీపంలో ఒంగో లు-కర్నూలు రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్ దూదే కుల సుభాని (27) మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం.. సుభానిది స్వస్థలం దోర్నాల మండలం చిన్నగుడిపాడు. డ్యూటీ కోసం మోటార్ సైకిల్‌పై ఒంగోలుకు వెళుతుండగా చీమలమర్రి సమీపంలో లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక సీఐ సుబ్బారావు, ఎస్సై కృష్ణయ్యలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గొబ్బూరు మాజీ సర్పంచి మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు



ఏలూరి కొండమ్మ (ఫైల్)

మండలంలోని గొబ్బూరు మాజీ సర్పంచ్ ఏలూరి కొండమ్మ (95) శనివారం మృతి చెందారు. ఆమె 2006-2011లో సర్పంచ్‌గా పని చేశారు. ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, జడ్పీటీసీ ఏరువ చలమారెడ్డివ తదితరులు కొండమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.



స్టాల్స్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నరేంద్ర వర్మ

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - బాపట్ల

మహిళలు స్వయం శక్తితో ఆర్థిక సమృద్ధి సాధించాలని శాసన సభ్యులు వేగేసేన నరేంద్ర వర్మ అన్నారు. పురపాలక సంఘం, మెప్మా ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ స్టాల్స్ ఆయన శనివారం ప్రారంభించారు. ప్రదర్శనలో డ్వాక్రా గ్రూపు సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. గ్రూపు సభ్యులు వ్యాపారాలు మెరుగు పర్చుకొనుటకు అవసరమైన రుణాలు బ్యాంకుల ద్వారా సమకూర్చాలని మెప్మా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, మెప్మా సిఎంఎం ఎన్ సుబ్రహ్మణ్యం, సిఓలు, ఆర్పిలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ మేనేజర్‌గా శ్రీమన్నారాయణ

ప్రజాశక్తి - బాపట్ల



డిఎం బి శ్రీమన్నారాయణ

ఆర్టీసీ డిపో నూతన మేనేజరుగా బి శ్రీమన్నారాయణ శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత్ కుమారి బాపట్ల డిపో మేనేజరుగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. కార్మికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తానని శ్రీమన్నారాయణ తెలిపారు. డిపోలో ఉద్యోగులు, ఆర్టీసీ సిబ్బంది మేనేజరును మర్యాదపూర్వకంగా కలిశారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు

వరద ప్రభావిత విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల కృష్ణా నదికి సంభవించిన వరదల కారణంగా ముంపుకు గురైన మండలంలోని పెదలంక, పెసర్లంక గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షురాలు కెవిఎన్ శిరీష స్టేషనరీ, ఆహార పదార్థాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల కారణంగా పాఠశాలల విద్యార్థులు, వారి కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. దీనిని పూర్తిస్థాయిలో ఏ ఒక్కరు భర్తీ చేయలేరని అన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న కొద్దిపాటి సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్‌కె మహబూబ్ బాషా, వి సురేష్ కుమార్, పి శేఖర్ బాబు, వి సత్యనారాయణ, వి ప్రతాప్, ఐఈడి ఉపాధ్యాయులు మేరీ పాల్గొన్నారు.

108 సిబ్బందికి సీలింగ్ ఫ్యాన్ బహూకరణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక 108 వాహన సిబ్బందికి తెలుగుదేశం నాయకులు చేవూరి వాసురెడ్డి సీలింగ్ ఫ్యాను శనివారం బహుకరించారు. గత మూడు నెలలుగా 108 సిబ్బందికి జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 108 సిబ్బంది ఉండే గదిలో ఫ్యాన్ లేక ఇబ్బంపడుతున్నట్లు 108 సిబ్బంది వాసురెడ్డికి తెలిపారు. స్పందించిన వాసురెడ్డి ఫ్యాను బహుకరించారు.

రైతులకు పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి

- అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలి - రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

ప్రజాశక్తి - పంగులూరు

వ్యవసాయ పెట్టుబడి కింద అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. రైతులకు పెట్టుబడి సాయం ప్రస్తావన ప్రభుత్వం నుంచి ఇంతవరకు రాలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో రైతుల ఓట్ల కోసం రైతులకు లేనిపోని ఆశలు కల్పించిన కూటమి నేతలు ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత ఇచ్చిన హామీని మరిచిపోవటం సరైనది కాదన్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని పోయాయని అన్నారు. లక్షలాది ఎకరాల్లో పంట పూర్తిగా నష్టపోయారని అన్నారు. నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వలేదనీ అన్నారు. వేలాది మంది కౌలు రైతులు కూడా నష్టపోయారని, కౌలు గుర్తింపు కార్డులు లేకపోవడం వలన వారికి కూడా పూర్తి స్థాయిలో నష్టపరిహారం ఇవ్వలేదని అన్నారు. వెంటనే కౌలు రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు కురిసిన వర్షాలకు కూడా మినుము పంట పూర్తిగా నష్టపోయిందని చెప్పారు. రైతాంగం తీవ్రంగా నష్టపోయి అప్పులు ఊబిలో కూలిపోతున్నారని చెప్పారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం కొంత ఊరట కలిగిస్తుందని చెప్పారు. ఖరీఫ్ సీజన్ అయిపోయి రబీ వచ్చిందని, అయినప్పటికీ పెట్టుబడి సాయం అందించకపోవడం బాధాకరమని అన్నారు. వీరందరికీ నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని నష్టపోయిన రైతులు అందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేదని, వ్యవసాయంలో 60శాతం కౌలు రైతులే ఉన్నారని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమైన కౌలు రైతులకు న్యాయం జరిగే విధంగా పెట్టుబడి సాయాన్ని అందించాలని కోరారు. అధిక వర్షాలు కారణంగా ఇప్పుడు నాగార్జునసాగర్ నీరు వృధాగా సముద్రం పాలవుతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం సాగర్ రెండో జోన్ క్రింద వరి సాగుకు పూర్తిస్థాయిలో సాగునీటిని ఇస్తామని ప్రకటించాలని కోరారు.



తలపనేని రామారావు, కార్యదర్శి

నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం చేయాలి



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ఆనందబాబు



శంకుస్థాపన చేయిస్తున్న ఎంపిడిఒ కె నేతాజీ



శంకుస్థాపన చేస్తున్న దర్శి టిడిపి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక విఠలేశ్వర నగర్ కాలనీలో రూ.60లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగలో భాగంగా కాలనీలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగించనున్నట్లు తెలిపారు. 1998లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో 200 మందికిపైగా లబ్ధిదారులకు ఇక్కడ నివేశన స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో సిసి రహదారుల నిర్మాణానికి ఏర్పాటు చేసి డస్ట్ నింపి ప్రజల రాకపోకలకు ఇబ్బందులేకుండా చేసినట్లు తెలిపారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ పాలనలో ఈ రహదారి పరిస్థితి అగమ్య గోచరం గా మారిందని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పూర్తి చేస్తామని అన్నారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా మాట్లాడుతూ ఐదేళ్లపాటు వైసిపి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన మెరుగు నాగార్జున కాలనీ అభివృద్ధిని పట్టించుకోలేదని అన్నారు. పైగా తెలుగుదేశం ప్రభుత్వంలో రహ దారికి కీవాల్ నిర్మాణాలు చేపట్టారని రోడ్లు కూడా వాళ్లే వేస్తారులే అంటూ ప్రజలను ఎద్దేవా చేసిన ఘటనలను గుర్తు చేశారు. అనంతరం రాచూరు గ్రామంలో పల్లె పండుగలో ఎంపీపీ లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయ భాస్కరి చేతుల మీదగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచి ధార రవికిరణ్మయి, ఎంపిడిఒ ఎస్‌వి రమణ, పిఓపిఆర్డి ఊహారాణి, ఎపిఒ శివ పార్వతి, ఎపిఎం శ్రీమన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి కోటా శ్రీనివాసరావు, పిఆర్ ఎఇ రామచంద్రవు, ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్, వై కరుణా శ్రీనివాసరావు, రాయల్ ప్రసాద్, మండవ రామ కోటేశ్వరరావు, మాచర్ల నాగరాజు, వామనపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వేమూరు : అమర్తలూరు మండలం మూల్పూరులో వివిధ అభివృద్ధి పనులకు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.30 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేయనున్నారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి కుంటపడిందని అన్నారు. గత ప్రభుత్వం ఒక్క రోడ్డు వేసిన పాపాన పోలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర పునర్నిర్మాణానికి పనిచేస్తుందని అన్నారు.

కారంచేడు : పల్లె పండుగ కార్యక్రమం వలన గ్రామాల అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ కె నేతాజీ అన్నారు. మండలంలోని తిమిడితపాడు, ఆదిపూడి, ఎర్రంవారిపాలెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. తిమిడిదపాడులో రూ.20లక్షలతో సిసి రోడ్డు, రూ.4.5 లక్షలతో గోకులం, ఆదిపూడిలో రూ.20లక్షలతో సిసి రోడ్డు, రూ.4.5లక్షలతో గోకులం, యర్రంవారి పాలెంలో రూ.2.3లక్షలతో గోకులం పనులకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎఇ దాసు, తెలుగుదేశం అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీహరి, ప్రధాన కార్యదర్శి కాశీం, నాయకులు కోసరాజు సురేంద్ర బాబు, తిమిదపాడు సర్పంచ్ సుబ్బులు పాల్గొన్నారు.

పర్చూరు : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పల్లె పండుగలో అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.1.05కోట్లతో వీరన్నపాలెం, పోతుకట్ల, కోమర్నేనివారిపాలెం, చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లో 22 పనులకు శంఖుస్థాపన చేసినట్లు ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. శంఖుస్థాపన చేసిన పనులను ఒక ప్రణాళికా బద్దంగా నిర్దిష్ట కాలంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఓ బుచ్చిబాబు, ఎంఎఈ శ్రీనివాసరావు, ఈఒఆర్డి సత్యనారాయణ, మాజీ జడ్పిటిసి దాసరి ఉషారాణి, నాయకులు షేక్ జమాలుద్దీన్, షేక్ శంషుద్దీన్, మానం హరిబాబు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని బూదవాడలో రెండు సిమెంట్ రోడ్లకు శనివారం ఎంపిడిఒ స్వరూప రాణి శంకుస్థాపన చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో రెండు సిమెంట్ రోడ్లు రూ.20లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి సుమంత్, ఎపిఒ సంతోషమ్మ, మండల అధ్యక్షురాలు తేళ్ల నాగమ్మ, పంచాయతీరాజ్ ఎఇ హనుమంతరావు, హౌసింగ్ ఎఇ కిషోర్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, తెలుగుదేశం నాయకులు కామారెడ్డి సుబ్బారెడ్డి, కామారెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అద్దంకి : పల్లెలను అభివృద్ధి చేయటానికి టిడిపి ప్రభుత్వం ముందుకు వచ్చిందని గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గ్రామాల్లో పల్లె పండుగ ఏర్పాటు చేసిందని టిడిపి దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ముండ్లమూరు మండలం శంకరాపురం, నూజిల్లపల్లి, మారెళ్ళ, జమ్మలమడక, పూరిమెట్ల గ్రామాల్లో రూ.64 లక్షల నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్లకు ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని వదిలేసిందని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసిందని అన్నారు. గ్రామాల్లో త్రాగు నీరు, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు నిధులు సమకూర్చి అభివృద్ధి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్ జనార్ధన్, హౌసింగ్ ఎఇ హనుమంతరావు, ఎపిఎం హనుమంతరావు, ఎపిఓ నాగరాజు, మాజీ ఎంపిపిలు మందలపు వెంకట్రావు, కోడిగ మస్తాన్, టిడిపి మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, శంకరాపురం సర్పంచ్ కూరపాటి మహేశ్వరి, నారాయణస్వామి, మారెళ్ళ మాజీ ఎంపిటిసి సుంకర రాఘవరెడ్డి, బ్రహ్మయ్య, నిడమానూరు శ్రీనివాసరావు, జిల్లెలమూడి చౌదరి పాల్గొన్నారు.

వేటపాలెం : మండలంలోని పుల్లరిపాలెం గ్రామంలో పల్లె పండుగ నిర్వహించారు. రూ.2.30కోట్ల విలువైన పనుల నిర్వహణకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం రాజేష్ బాబు మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ పథకాలు ఉపయోగం చేసుకుని అభివృద్ధి చెందాలని అన్నారు. పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే పల్లె పండుగ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నక్కల శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న పర్చూరు ఎంపిడిఒ ప్రద్యుమ్నకుమార్



శంకుస్థాపన చేస్తున్న పంగులూరు ఎంపిడిఒ స్వరూపరాణి



శంకుస్థాపన చేస్తున్న వేటపాలెం ఎంపిడిఒ ఎం రాజేష్‌బాబు

గిరిజన గూడేల్లో వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల పోతురాజుపెంట, గౌతమబుద్ధుని కాలనీ, పుల్లయ్య కుంట తదితర గిరిజన గూడేల్లో వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వి.కోటానాయక్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాలను నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ఆఫీసర్ ఎస్ మల్లిక ఆ మూడు గూడేల్లోని గిరిజనులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది టి రమణమ్మ, లక్ష్మీదేవి, బయమ్మ, నలగాటి వెంకట్రామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెడ్డీగ్యాంగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ చౌడయ్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



ఎస్ఐ చౌడయ్య

చెడ్డీ గ్యాంగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యర్రగొండపాలెం ఎస్ఐ పి చౌడయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎవరైనా దళారులు మోసం చేసే అవకాశం ఉంటే అటువంటి వారిని నమ్మి మోసపోవద్దని తెలిపారు. ముఖ్యంగా మీ ప్రాంతానికి గుర్తు తెలియని వ్యక్తులు వస్తే వారి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరస్తులు కూడా ఫోన్‌లలో మిస్డ్ కాల్స్ ఇచ్చి.. మీకు ఏవో కొత్త ఆశలు కల్పిస్తూ ఓటీపీలు చెప్పాలని అడుగుతారని తెలిపారు. బ్యాంక్ ఖాతా నెంబర్లు చెప్పమన్నా చెప్పకూడదని వివరించారు. పొలాల్లో గంజాయి లాంటి మొక్కలు నాటకూడదని చెప్పారు. అది చాలా పెద్ద నేరం కిందకు వస్తోందని వివరించారు. పండుగలకు, పెండ్లిలకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ యాదిద్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



డాక్టర్ యాదిద్య

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ దేవర యదిద్యా అన్నారు. శనివారం యర్రగొండపాలెం లోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చలికాలం వస్తున్నందున ఆయాసం, దగ్గు తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. అటువంటి వారికి అవసరమైన అన్ని రకాల మందులు నెబులైజర్లు, ఆక్సిజన్ ఏరియా వైద్యశాలలో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఆయాసంతో ఇబ్బందులు పడే రోగులు యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలకు వచ్చి చికిత్సలు పొందాలని తెలిపారు. ప్రతిరోజూ 700 మంది దాకా వివిధ వ్యాధులతో రోగులు వచ్చి చికిత్సలు పొంది వెళుతున్నట్లు చెప్పారు. అన్ని రకాల ఆపరేషన్‌లను చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలకు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారని చెప్పారు. బ్లడ్ స్టోరేజ్ పాయింట్ అందుబాటులో ఉందన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో బురద సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల చొరవతో చీమకుర్తి నుంచి 50 ట్రక్కుల చిప్స్ తెప్పిస్తున్నట్లు తెలిపారు.

సిఎం దృష్టికి కళాకారుల సమస్యలు

సంఘం ఉపాధ్యక్షురాలు బోను దుర్గ వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళినట్లు అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు బోను దుర్గ తెలిపారు. శనివారం సంఘ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల సహాయార్థం అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సేకరించిన 4 లక్షల విరాళాన్ని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు ఆధ్వర్యంలో, మంగళగిరి టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందజేశామన్నారు. గత నెలలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం నిర్వహించిన కళా ప్రదర్శనలకు దాతలు ఇచ్చిన సేకరించిన రూ.2 లక్షలు, పద్మశ్రీ ఎడ్ల గోపాలరావు రూ.2 లక్షలు మొత్తం నాలుగు లక్షల రూపాయలు అందించామన్నారు. కార్యక్రమానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో కళాకారులు పడుతున్న కష్టాలు, వారికి అందవలసిన బెనిఫిట్స్‌పై సిఎంకు వివరించామన్నారు. గత ప్రభుత్వంలో చింతామణి నాటకాన్ని ఒంటెద్దు పోకడతో నిషేధించారో యధావిధిగా దాన్ని ప్రదర్శనలు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిఎంను కోరామన్నారు. కార్యక్రమంలో అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు శ్రీమతి గంట మంగాదేవి, అధ్యక్షులు ద్వారపురెడ్డి ధనుంజయ రావు, కార్యదర్శి రౌతు వాసుదేవ్, ముప్పల వెంకటరమణ , బొంగు భాస్కర్, మిమిక్రీ శివ, గంటా సూర్యనారాయణ, ఎడ్ల గోపాలరావు జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, గాయనీలు ఏల్చూరి అనంతలక్ష్మి, తాళ్లూరు శ్రీదేవి, చల్లా నాగేశ్వరమ్మ, ధేనువకొండ సుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్

కేంద్ర నిధులతో అమలయ్యే

సంక్షేమ ఫలాలు నిరుపేదలకు అందించాలి..

బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కేంద్రం నిధులతో అమలయ్యే సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి నిరుపేదకు అధికారులు అందించాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) శనివారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. కమిటీ చైర్మన్‌గా పార్లమెంట్ అధ్యక్షులు కృష్ణప్రసాద్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఖర్చు పెడుతున్న ప్రతి పైసా నిరుపేదకు చేరాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు అన్నారు. అత్యంత పారదర్శకంగా పథకాలు అమలు కావాలి, అభివృద్ధి పనులు జరగాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వెనుక బాటులో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూరాలని ఆయన సూచించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. అన్ని శాఖలలో కేంద్రం, రాష్ట్రం నుంచి నిధులు పెండింగ్‌లో ఉంటే స్పష్టమైన నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆయన సూచించారు. జిల్లాలో 3.50 లక్షల కుటుంబాలు ఉన్నాయన్నారు. అర్హులైన ఎస్సీలందరికీ జాబ్ కార్డులు జారీ చేయాలని, ఉపాధి హామీ పథకం ద్వారా అధికంగా పనులు కల్పించాలని తెలిపారు. అభివృద్ధి పనులు పారదర్శకంగా జరగాలన్నారు. యువతలో నైపుణ్యాలకు అభివృద్ధి కల్పించే దిశగా శిక్షణ ఇవ్వాలన్నారు. గృహాల నిర్మాణాలలో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన ఇళ్ల గురించి ఆరా తీశారు. సమగ్ర వివరాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. చిరు ఉద్యోగులు, కార్మికుల కొరకు బాపట్లలో ఈఎస్ఐ హాస్పిటల్ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాలలో సుస్థిర ఆస్తులు సమకూర్చడమే లక్ష్యంతో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చు చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. గ్రామాల అభివృద్ధి కొరకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులు కేటాయిస్తుందని ఆయన వివరించారు. ప్రజలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంతో ప్రభుత్వం నిధులిస్తుందన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకంలో సమగ్ర విచారణ చేసి అర్హులకు మాత్రమే పింఛన్ అందించాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. అక్రమ పింఛన్ ఏరివేత జరగాలన్నారు. పింఛన్ సొమ్ము కాజేసిన వారి నుంచి ఆర్ఆర్ చట్టం ద్వారా నగదు వసూలు చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా నిష్పక్షపాతంతో విచారించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ప్రకాశం జెడ్పి సీఈవో చిరంజీవి, గుంటూరు జడ్పీ సీఈవో జ్యోతిబసు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని

చెవిలో పువ్వులతో నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం



నిరసన తెలుపుతున్న కార్మికులు

మార్కాపురం మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల్లో 21 మందిని తొలగించారు. విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి నాల్గవ రోజుకు చేరాయి. చెవిలో పువ్వులతో కార్మికులు నిరసన తెలిపారు. ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు ఆధ్వర్యంలో) జరుగుతున్న ఆందోళనలో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల పట్ల అధికారుల మొండి వైఖరి విడనాడాలన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులతో కార్మికులను బలి చేయొద్దని కోరారు. అధికారులు చట్టబద్ధంగా తమ విధులు నిర్వహించాలని, నియమ నిబంధనలు పాటించాలన్నారు. సొంత వ్యవహారంగా నిబంధనలు అతిక్రమించడం సరికాదని హెచ్చరించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం సరికాదన్నారు. కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దన్నారు. ఈ ఆందోళన ఇంతటితో ఆగబోదని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.సుబ్బరాయుడు, రమణ, యూసుఫ్, పి శ్రీను, సలాం, సుబ్బారెడ్డి, షేక్ షబ్బీర్, ఎస్.కె.ఇమాంషా, నాగేంద్ర, వెంకటయ్య, నాగయ్య, మరియదాసు పాల్గొన్నారు.

ఏకెయు విసిని కలిసిన ఏయు పూర్వపు విసి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఏకెయు విసికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏయు పూర్వపు విసి

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తిని, ఆంధ్రా యూనివర్శిటీ పూర్వపు ఉప కులపతి ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం సాయంత్రం విసి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఇద్దరూ ఆంధ్రా యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్లు కావడంతో పలు అంశాలపై చర్చించుకున్నారు. ప్రస్తుత విద్యా విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులు, చేర్పులపై ప్రధానంగా చర్చించారు. ఆంధ్రా యూనివర్శిటీ పూర్వపు ఉప కులపతి వెంట వచ్చిన ఒంగోలు ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం విద్యాసంస్థల చైర్మన్ ఎం.నాగేశ్వరరావు విసి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబుతో పలు అంశాలపై చర్చించారు. విసిని కలిసిన వారిలో ఏ.కే.వి.కే.విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి పి.చెంచు రామయ్య, పాలక మండలి సభ్యుడు కె.మస్తాన్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.



నగరంలో పర్యటిస్తున్న మేయర్, కమిషనర్

నగరంలో మేయర్, కమిషనర్ పర్యటన

వర్షపు నీరు నిలవకుండా పర్యవేక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో భారీ వర్షం కురవడంతో వర్షపునీరు నిలవకుండా ఉండేలా మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు చర్యలు తీసుకున్నారు. నగరంలోని ట్రంకురోడ్డు, డీమార్ట్ ఏరియా, దర్గా సెంటర్, బిఎంసి కాంప్లెక్స్ సెంటర్, కొత్తపట్నం బస్టాండ్‌లలో పర్యటించారు. డ్రైనేజీ సమస్య రాకుండా చూడాలని, మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి అవసరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చిన్నపాటి వర్షానికే ఒంగోలు నగర వీధులన్నీ జలమయమైపోతున్న పరిస్థితులపై నగరపాలక సంస్థ, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్‌కు పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీరభద్రాచారి విజ్ఞప్తి చేశారు. శనివారం సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మురుగునీటి కాల్వల నిర్మాణంలో సాంకేతిక లోపాలు, వాటి నిర్వహణలో నిర్లక్ష్యంతో వర్షం సమయంలో నీరు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. వరద నీరు బయటకు పోయే ప్రాంతాలన్నీ ముఖ్యంగా పోతురాజు కాల్వ ఆక్రమణలకు గురై వరదనీరు నగరాన్ని ఆక్రమిస్తుందన్నారు. అన్నింటా ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కాసుల కక్కుర్తి కోసం సాంకేతిక లోపాలతో నగరం, కాలనీల ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నగర ప్రజల కోసం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తక్షణం ఒంగోలులో డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళన కోసం చర్యలు చేపట్టాలని వీరభద్రాచారి కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అమన్, అజయ్ భువన, ప్రసాద్, అనూరాధ, ఎంఎస్ నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల మహిళా పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని యర్రగొండపాలెం క్లస్టర్‌లో ఏరియా కోఆర్డినేటర్ డి.దానం అన్నారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి నెలవారీ సంపాదించే డబ్బును పొదుపు చేసుకునేలా చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ నిధి ఏజియం హర్ష వర్ధన్, ఐదు మండలాల ఏపియంలు శ్రీనివాసరావు, వెంకటయ్య, పోలయ్య, అడ్వర్ట్, కృపమ్మ, ఎలోసి వెంకిరెడ్డి, స్త్రీనిధి మేనేజర్ వీరారెడ్డి, సిసిలు, అకౌంటెంట్‌లు పాల్గొన్నారు.

22న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఈనెల 22వ తేది న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుత్తా శ్రీధర్ నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో అమరరాజ బ్యాటరీ, రిన్యూస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు పదో తరగతి నుంచి పీజీ అర్హత కలిగి 19 నుండి 30 సంవత్సరాలు వయసు కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల స్కిల్ సెంటర్ కోఆర్డినేటర్ విజయకుమారిని సెల్ 7013182284, 6302220609 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మధ్యాహ్న భోజనం ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - అద్దంకి

ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి నాగ వెంకటలక్ష్మి శనివారం మధ్యాహ్నం పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల్లో త్రాగునీటి సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టాక్ రూమ్ను పరిశీలించి సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో అందజేస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాల గురించి సూచనలు చేశారు. పాఠశాల్లోని వసతులను ఆమెకు ప్రధానోపాధ్యాయులు వివరించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి పద్మావతి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యర్రమోతు రమేష్ బాబు, ఉచిత న్యాయ సహాయ న్యాయవాదులు షేక్ మహమ్మద్ రఫీ, ఎం ప్రకాష్ పాల్గొన్నారు.

చీరాల : స్థానిక కెజిఎం ఉన్నత పాఠశాలను జడ్జి ఎస్ సుధా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల్లోని వంటశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. పాఠశాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎల్‌విలు ఎం రామారావు, ఎన్‌డి మతీన్, ఎస్ఎం సుభాని, ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణమోహన్, బాబు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా మూడు రోజులు క్రితం ఆ పాఠశాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించే క్రమంలో భోజనం చాలీ చాలకుండా వంట చేశారని, ఆ విషయంలో విద్యార్థులు ఆకలికి ఇబ్బంది పడ్డారని, వెంటనే ఉన్నత అధికారులు జోక్యంతో వెంటనే వండి విద్యార్థులకు వడ్డించినట్లు కూడ తెలిసింది.


పాఠశాల్లో భోజనం పరిశీలిస్తున్న జడ్జి నాగవెంకటలక్ష్మి


పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి ఎస్ సుధా

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - బాపట్ల

బానిసత్వం లేని ప్రపంచాన్ని సృష్టించేందుకు మానవ అక్రమ రవాణాను అరికట్టి దోపిడీకి గురవుతున్న మహిళలు, బాలికలు చిన్నారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవనం సాగించే విధంగా ప్రతి ఒక్కరు తమ వంతు కర్తవ్యం నిర్వర్తించాలని డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు అన్నారు. మదనపల్లి గ్రామ జ్యోతి సొసైటీ సౌజన్యంతో స్థానిక రోజ్ సంస్థ ఆధ్వర్యంలో నిశ్శబ్ద నడకను ఆయన ప్రారంభించారు. బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో సత్తిబాబు మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, దోపిడీకి గురవుతున్న చిన్నారులను కాపాడేందుకు ప్రభుత్వం 1098, 181 హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రజలు అప్రమత్తమై బాలికలు, మహిళలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల నుండి ప్రారంభమైన ర్యాలీ చీలు రోడ్డు వరకు సాగింది. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి బాలికలను సంరక్షించుకోవాలనే నినాదాలు చేశారు. కార్యక్రమంలో డిఈఓ కె నారాయణరావు, డివిఈఓ యర్రయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి జె రాజదెబోరా, సిఓఓ ఉమా, జిల్లా మహిళా సంక్షేమ అధికారి పురుషోత్తమరావు, బాలల సంరక్షణ అధికారి కృష్ణ, బాలల పరిరక్షణ అధికారి డిసం జయ్ కుమార్, ఎన్ఎస్ఓ డివి శ్రీనివాసరావు, ఎపిఓ ఉషా, ఉమన్స్ ఇంజనీరింగ్ కాలశాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, న్యాయవాది జాకబ్, వరల్డ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు వేజెండ్ల లాజర్, సపోర్ట్ సంస్థ ఖాన్, పారాలీగల్ వారంటీర్లు నల్లమోతు శామ్యూల్ జాన్, అరుణ, గుదె రాజారావు, పొందుగల ప్రసాదరావు పాల్గొన్నారు.

చీరాల : ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మానవ అక్రమ రవాణా, బానిసత్వ నిర్మూలనలో భాగంగా వాక్ ఫర్ ఫ్రీడమ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డిఎస్‌పి పి జగదీష్ నాయక్ అన్నారు. మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జండా ఊపి ప్రారంభించారు. సీఐ ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్రమ రవాణాకు పాల్పడిన ముఠాలు వారిని వ్యభిచార గృహాలకు, అవయవ అక్రమ వ్యాపారాలకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. చిన్న పిల్లలు, మహిళలను ఎప్పుడు కనిపెట్టుకొని ఉండాలని అన్నారు. వారి రక్షణ బాధ్యత కుటుంబం తీసుకోవాలని అన్నారు. అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతర్జాతీయ ఎన్జీఒ ఆస్ట్రేలియా, ది మూమెంట్ ఆఫ్ ఇండియా ముంబై, గ్రామ జ్యోతి సౌజన్యంతో మదర్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు నాగిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో చైతన్య భారతి డిగ్రీ కళాశాల విద్యార్థినిలు, ప్రిన్సిపల్ సోమేశ్వరరావు, కళాశాల యాజమాన్యం ఎం రాంబాబు, ఎన్జెవి సురేష్ కుమార్, గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థినిలు, ప్రిన్సిపల్ వివి ఫణీంద్ర కుమార్, చీరాల మహిళా మండలి ప్రాజెక్టు మేనేజర్ కె వెంకట్రావు, డీసీఐసీ కన్వీనర్ డి ఇమ్మానుయేల్, కరుణ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ టి పాపయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ప్రెసిడెంట్ సూర్య ప్రశాంతి రాయ్, పాల్గొన్నారు.


వాక్ ఫర్ ఫ్రీడంలో కళాశాల విద్యార్థులు


బాలికల ర్యాలీ, మానవహారం

గుంటూరుకు బస్సు సౌకర్యం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు నుండి గుంటూరు వెళ్లడానికి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ గుంటూరు అధికారులకు పలువురు ప్రయాణికులు తమ ఇబ్బందులను వివరించారు. స్పందించిన గుంటూరు ఆర్ఎం రవికాంత్ త్వరలో గుంటూరు వన్ డిపో నుంచి ఇంకొల్లుకు పల్లె వెలుగు బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్సు ఉండే విధంగా ఏర్పాటు చేయనున్నట్లు ప్రయాణికుల సంఘం మండల అధ్యక్షులు అన్నంబొట్ల మోహనకృష్ణ తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాపట్ల నుండి ఇంకొల్లుకు పల్లె వెలుగు బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పర్చూరు దాకా వచ్చే బస్సులను ఇంకొల్లు వరకు పొడిగిస్తామని తెలిపారు. అక్టోబర్ నెలాఖరికి సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు.


ఈ తేరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల సమావేశం

మునగాకుతో ఎంతో మేలు

ప్రజాశక్తి - బాపట్ల

బాలింతలు, గర్భిణీలకు మునగాకు వంద రోగాలను దూరం చేస్తుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు అప్పికట్ల సెక్టార్ సూపర్వైజర్ కె కుమారి చెప్పారు. మండలంలోని ఈతేరు అంగన్‌వాడీ కేంద్రంలో కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్‌లో భాగంగా తల్లుల సమావేశం శనివారం నిర్వహించారు. మునగాకులో అత్యంత విలువైన పోషకాలు ఉన్నాయని అన్నారు. మునగాకును ఆహారంగా తీసుకోవచ్చని అన్నారు. మునగాకును ఆహారంగా తీసుకుంటే శరీరంలోని అనేక రుగ్మతలు మాయం అవుతాయని అన్నారు. మునగాకులో ఏ, సి విటిమిన్లు పుష్కలంగా లభిస్తాయని అన్నారు. మునగాకు, కరివేపాకు ఆహారంలో తప్పని సరిగా తీసుకోవాలని వివరించారు. సమావేశంలో ఎఎన్ఎం ఉష, అంగన్‌వాడీ కార్యకర్తలు కె గీత, వై మేరీ కుమారి పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

అన్నదానంలో డొక్కా సీతమ్మకు ఎవరూ సాటిలేరని జనసేన మండల అధ్యక్షులు మందపాటి కిషోర్ అన్నారు. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం వెనుక డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి ఉందని అన్నారు. అధికారంలోకి వస్తే డొక్కా సీతమ్మ క్యాంటీన్లు పెడతామని ఎన్నికల ప్రచారంలో పవన్ మాటిచ్చారని, కూటమి అధికారంలోకి రావడం, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో అన్నా క్యాంటీన్లు పునరుద్ధరించాలని నిర్ణయించారని తెలిపారు. పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన మాట కూడా నెరవేరేలా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టారని అన్నారు. ఆస్తులు కరిగిపోయినా అన్నదానం ఆపని డొక్కా సీతమ్మ ఆదర్శమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను స్మరించుకుంటూ ఇంకొల్లుకు చెందిన జనసేన నాయకులు ఎన్నార్కె మన్యం శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం మార్టూరులో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు కందుల ప్రేమ్ కుమార్, బొబ్బేపల్లి నటరాజ్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగరాజు, తవ్వా సత్యనారాయణ, ఆర్కె రెడ్డి, కొండపల్లి వెంకటేశ్వరరావు, ముస్తఫా, అంబేద్కర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలోని నందిరాజుతోట విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ ఎఈ బి సాయి శ్రీనివాస్ శనివారం తెలిపారు. దీంతో ఆదివారం ఉదయం 7నుండి 11గంటల వరకు పట్టణంలోని అక్బర్‌పేట, మున్సిపల్ ఆఫీస్, తవ్వకలువ, అగ్రహారం, యాదవపాలెం, చీల్ రోడ్డు, శ్రీనివాస్‌నగర్, కలెక్టరేట్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

23న మండల సమావేశం

ప్రజాశక్తి - పర్చూరు

మండల సర్వసభ్య సమావేశం 23న ఎంపిపి మేక ఆనంద కుమారి అధ్యక్షతన జరుగునని ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. మండలంలోని ఎంపిటిసిలు, జడ్పిటిసి, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.



బ్రాంజ్ మెడల్స్ సాధించిన యస్వంత్ రాజు, మహాలక్ష్మి

జాతీయస్థాయి పథకాలు పొందిన విద్యార్థులు

ప్రజాశక్తి - చీరాల

జాతీయ స్థాయి 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చీరాల ప్రాంతానికి చెందిన ఇద్దరు విద్యార్థులు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈసందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు పులుగు ధనుంజయ, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతు ఈ నెల 17నుండి 19వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయని అన్నారు. ఈ పోటీల్లో మండలంలోని విజయనగరకాలనీకి చెందిన వేల్పుల యస్వంత్ రాజు అండర్ 16 కేటగిరి లాంగ్ జంప్‌లో బ్రాంజ్ మెడల్ సాధించగా పట్టణంలోని వైకుంఠపురంకు చెందిన పాలవలస మహాలక్ష్మి అండర్ 20 విభాగంలో 400 మీటర్ల రిలే పరుగు పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ధనుంజయ, శ్రీనివాసరెడ్డిని ప్రశంసించారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు బాలాజీ

కార్పోరేషన్లకు నిధులు కేటాయించి రుణాలివ్వాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

బిసి, ఎస్సి, ఎస్టీ కార్పోరేషన్లకు ప్రభుత్వం నిధులు కేటాయించి వృత్తి దారులకు రుణాలు మంజూరు చేయాలని చేతి వృత్తుదారుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేతివృత్తి దారుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 22న రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ శాఖ కార్యాలయాల వద్ద నిర్వహిస్తున్న ధర్నాల్లో చేతి వృత్తి దారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేతి వృత్తులను ప్రోత్సహిస్తామని 56కార్పోరేషన్లను ఏర్పాటు చేసి ఆయా కార్పోరేషన్లకు ఛైర్మన్లను, పాలకవర్గాలను నియమించి నిధులు మంజూరు చేయకుండా వృత్తి దారులను మోసం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు 'సూపర్ సిక్స్' వాగ్దానాలతో పేదలను, చేతివృత్తి దారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు వంద రోజులు గడిచిన చేతివృత్తి దారులను ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని అన్నారు. వృత్తిదారుల స్వయం ఉపాధి కోసం పారిశ్రామిక విధానం అమలు ద్వారా బ్యాంకుల నుండి సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. జనాభాలో 30శాతంగా ఉన్న చేతివృత్తి దారులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో 25శాతం నిధులు కేటాయించాలని, 50 శాతం సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేయాలని కోరారు. ఐత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించాలని కోరారు. ఈనెల 22న జరిగే ధర్నాలో వృత్తిదారులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో చేతి వృతి దారుల సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామ కోటేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీను హత్యకు కారకులను తేల్చాలని ఆందోళన

- గడియార స్తంభం సెంటర్లో బైఠాయించిన గ్రామస్థులు
- డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ



సెంటర్లో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు రోడ్డులో నిర్మాణంలో ఉన్న కల్వర్టు కుంటలో వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామానికి చెందిన పులి శ్రీనివాసరావు అలియాస్ బాతుల శ్రీను అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనలో అతని మృతికి కారణమైన వారిని తేల్చి శిక్షించాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక గడియార స్థంభం సెంటర్లో మృతుని బంధువులు, పాపాయిపాలెం గ్రామస్థులు శనివారం బైఠాయించారు. ఘటనను పోలీసులు రోడ్డు ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే శ్రీనును హత్య చేసి నీటి కుంటలో పడేసి ఉంటారని గ్రామస్థులు ఆరోపించారు. శ్రీను మృతిపై సమగ్ర విచారణ చేసి మృతికి కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాడ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు బాధిత కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. నిరసన దీక్ష వద్ద మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆందోళనకారులను అదుపు చేసేందుకు సంఘటన స్థలంలో పోలీసులు భారీగా మోహరించారు. పులి శ్రీనివాసరావు మృతి కేసును చేదించడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. పోలీసులు తక్షణమే పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషులను పట్టుకుని శిక్ష పడేలా చేసి బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటల పాటు ఆందోళన చేస్తున్న గ్రామస్తులు వద్దకు డీఎస్పీ జగదీష్ నాయక్ చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. శ్రీను హత్య కేసులో అనుమానితులు ఎవరైనా ఉంటే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అందరితో సన్నిహితంగా ఉండే శ్రీను మృతి బాధాకరమని, శవ పరీక్షల రిపోర్టు వచ్చే వరకు సమన్వయం పాటించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని డిఎస్‌పి హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు.



డిఎస్పీ జగదీష్ నాయక్‌తో మాట్లాడుతున్న మృతుని కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్నారు మాజీ డిప్యూటి స్పీకర్ కోన రఘుపతి

21న మేరుగ ప్రమాణం

ప్రజాశక్తి - బాపట్ల

వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున పదవీ బాధ్యతలు స్వీకరణ మహోత్సవం ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు మాజీ డిప్యూటి స్పీకర్, మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. పదవి బాధ్యత స్వీకారాన్ని స్థానిక ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎంఎంసి మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, వైసిపి మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, వైసిపి నాయకులు వడ్డీముక్కల డేవిడ్, జోగి రాజా పాల్గొన్నారు.



చెత్త తొలగింపు చేస్తున్న కార్యదర్శి సుబ్బారావు

పారిశుధ్య పనుల నిర్వహణ

ప్రజాశక్తి - చీరాల

ప్రజాశక్తి కథనానికి స్పందన

పారిశుద్ధ్యం లోపించడం తో గ్రామంలో విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని ఈ నెల 18న ప్రజాశక్తి దినపత్రికలో 'విజయనగర కాలనీలో పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికతో వచ్చిన కథనానికి పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు స్పందించారు. గ్రామంలో పేరుకు పోయిన చెత్త దిబ్బల తొలగింపుకు చర్యలు చేపట్టారు. ఈపురిపాలెం నుండి పంచాయతీ ట్రాక్టర్ తీసుకువచ్చి పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. గ్రామంలో ఇళ్ల మధ్య చేరిన మురిగు నీటి వద్ద బ్లీచింగ్ చల్లించారు. కార్యదర్శి పనితీరు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ తాను నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టానని, గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఉత్సాహంగా అట్లతద్ది వేడుకలు

ప్రజాశక్తి - అద్దంకి

గతంలో ప్రతీపండుగా చాలా ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకునేవారు. అటువంటి వాటిలో 'అట్లతద్ది' ఒకటి. దానినే ఉయ్యాల పండగని కూడా అంటాం. పెద్ద వేప చెట్లకు లేదా విడిగా తాటి మానులతో ఏర్పాటు చేసిన ఉయ్యాల ఊగి హుషారుగా, సంతోషంగా గడిపే వారు. వివిధ కారణాల వలన కాలక్రమేణా అటువంటి పండుగ నామ మాత్రంగా జరుగుతున్నాయి. అదీ పెంకుటిళ్లున్న వారు ఇంటి చూరుకు ఉయ్యాల గట్టి మమ అనిపిస్తున్నారు. ఆ వెసులు బాటు లేని వారికి అదీలేదు. గోనుగుంట్ల సుబ్బారావు, రోటరీ ఆధ్వర్యంలో హరి హర గోశాలలో తాటిమానులతో పెద్ద ఉయ్యాల ఏర్పాటు చేసి అట్లతద్ది వేడుక ఘనంగా జరిపారు. మన పండుగల విశిష్టత, అట్లతద్ది రోజు మహిళలు చేసే గౌరీ వ్రతం గురించి వివరించారు. స్థానిక మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోటరీ ప్రతినిధులు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, జాగర్లమూడి శివకుమారి, కొల్లా భువనేశ్వరి, ఉటుకూరు నగరాజకుమారి, కాకర్ల వెంకటేశ్వర్లు, పసుపులేటి ఆంజనేయులు, బాచిన పూర్ణ, సుబ్రహ్మణ్యం, చామర్తి గురుశేఖర్, అమరనేని శ్రీనివాసరావు, పోకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదలంకలో పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద్దలంక గ్రామంలో ఎస్ఐ ఎం శివయ్య, వేమూరు సిఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం రాత్రి పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి చట్టం అమలు తీరు, సమాజంలో మెలగ వలసిన అంశాలపై వివరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను ముందుకు తీసుకు వెళ్లేందుకు ఈ విధంగా గ్రామస్తులతో కలిసి ప్రజలకు ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసు కోవడం కోసం పల్లె నిద్ర చేపట్టినట్లు తెలిపారు. సమస్యల పరిష్కార మార్గాలను చూపటం వంటి చర్యలు పల్లె నిద్ర ద్వారా అమలు జరుగుతాయని తెలిపారు. పెదలంక గ్రామంలో రాత్రి సుమారు పది గంటల సమయంలో గ్రామస్తులను ఒక ప్రాంతానికి చేర్చి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని గ్రామంలోనే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవడం ద్వారా సామరస్య వాతావరణం నెలకొంటుందని సిఐ ఆంజనేయులు వివరించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చి చెప్పుకోలేని అంశాలను ఈ పల్లెనిద్ర ద్వారా పోలీసులకు తెలియజేసుకునే వెసులుబాటు కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పోలీసులతోపాటు టిడిపి నాయకులు వేములపల్లి రత్న గోపాల్, పలువురు గ్రామ పెద్దలు ఉన్నారు.




పల్లెనిద్రలో మాట్లాడుతున్న ఎస్ఐ శివయ్య

పాఠశాలల చుట్టూ వదలని వర్షపు నీళ్లు

ప్రజాశక్తి - రేపల్లె

రవాణా సౌకర్యం లేని మారుమూల లోతట్టు ప్రాంతం కాదు. పట్టణంలో ప్రధాన రహదారి వెంట ఉన్న ప్రకాశం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం. గత పాలకుల విపరీత పోకడలకు ప్రస్తుత అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. ఓపెన్ దియేటర్ ప్రాంగణం. టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో పట్టణంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం వర్షపు నీటిలో నానుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు నరకప్రాయంగా మారింది. వర్షం పడిన తర్వాత వారాల తరబడి పాఠశాల ప్రాంగణంలో నిలువ ఉన్న వర్షపు నీటిలో నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదే ప్రాంగణంలో అంగన్‌వాడి సెంటర్ ఉంది. నిర్లక్ష్యానికి గురైందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 2019వరకు ఓపెన్ థియేటర్ ప్రాంగణం వివిధ సాంస్కృతిక కార్యకలాపాలతో పాటు చిన్న చిన్న సభలు సమావేశాలకు వేదికైంది. ప్రకాశం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల పిల్లలతో కల కల లాడుతూ ఉండేది. అలాంటిది 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పాఠశాల ప్రాంగణాన్ని అధ్వాన్నంగా, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చారనే ఆరోపణలు ఉన్నాయి. నాడు నేడు అంటూ పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించిన గత ప్రభుత్వం ప్రకాశం ప్రాథమిక పాఠశాల అభివృద్ధి చెయ్యకపోగా నిర్వీర్యం చేశారనే విమర్శలు ఉన్నాయి. అంగన్‌వాడి కేంద్రంతో పాటు డ్వాక్రా మహిళల మార్టును ఏర్పాటు చేశారు. అప్పటి నుండి పారిశుధ్య పనులకు ఉపయోగించే యంత్రాలను పాఠశాల ప్రాంగణంలో నిలుపుదల చేసి విద్యార్థులు ఆడుకోవటానికి వీలు లేకుండా కళ తప్పించారు. ప్రకాశం మున్సిపల్ పాఠశాల ప్రాంగణంలో ఉన్న 8, 9, 10 వార్డులకు చెందిన అంగన్‌వాడీ సెంటర్, పాఠశాల విద్యార్థులు లోపలికి వెళ్లేందుకు దారి కూడా లేకుండా చేశారు. అంగన్‌వాడి కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు నీళ్ళల్లో ఎక్కడ కాలు జారుతుందోనని అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఉపాధ్యాయుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోజు నీళ్లల నడుచుకుంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రక్కనే ఉన్న డ్వాక్రా మహిళ మార్టుకు రహదారిని ఏర్పాటు చేసిన పాలకులు పాఠశాల విద్యార్థులు వెళ్లేందుకు ఏర్పాటు చెయ్యకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం చుట్టు నీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వర్షపు నీటిలో ప్రకాశం ప్రాథమిక పాఠశాల



వర్షపు నీటిలో అంగన్‌వాడీ కేంద్రం



బాలికా సదన్‌ను పరిశీలిస్తున్న జడ్జి వాణి

బాలికాసదన్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బాపట్ల

బాలికల ప్రత్యేక అవసరాలు గుర్తించి వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని జడ్జి జి వాణి అన్నారు. పట్టణంలోని బాలికా సదన్ శిశు గృహాన్ని ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అందుతున్న సదుపాయాలను చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ఉమ, బాలికా సదన్ సూపరింటెండెంట్ సుబ్బలక్ష్మి, డిసిపిఓ పి పురుషోత్తం, బాలల సంరక్షణ అధికారి కృష్ణ, సఖి సిఎ ఉష, సపోర్ట్ సంస్థ ప్రతినిధి ఖాన్ పాల్గొన్నారు.



ట్రై సైకిళ్ళను అందిస్తున్న లెట్స్ హెల్ప్ సంస్థ

వికలాంగులకు హెల్ప్ సంస్థ చేయూత

ప్రజాశక్తి - చీరాల

లెట్స్ హెల్ఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ రామిశెట్టి దిలీప్ కుమార్, అనూష దంపతుల సహకారంతో నిరుపేద దివ్యంగులకు ట్రై సైకిళ్ళు శనివారం అందజేశారు. వడ్డె సంఘానికి చెందిన చిరంజీవి, పాత చీరాలకు చెందిన కొండారెడ్డి అనే దివ్యాంగుల ఇబ్బందులను గుర్తించి సంస్థ ప్రతినిధి కనపర్తి కిరణ్ చేతుల మీదగా సైకిలు అందజేశారు. సంస్థ ప్రతినిధి కనపర్తి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లుగా పేద, దివ్యాంగ ప్రజలకు సంస్థ తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చేయూత అందించేందుకు సంస్థ నెలకొల్పబడిందని అన్నారు. ఇప్పటి వరకు 30మంది దివ్యాంగులకు ట్రై సైకిళు అందజేశామని తెలిపారు. కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. డేవిడ్, దయాకర్, శివపూర్ణ, నిస్సి, జయపాల్, సురేష్, సాంబయ్య పాల్గొన్నారు.

మాగాణి రైతులకు అపార నష్టం

- అడుగడుగునా గండ్లు
- నీటిలోనే పంటలు
- పరిశీలించిన రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు



పరిశీలిస్తున్న రైతుసంఘం, కౌలురైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా మాగాణి భూములు మునిగిపోయాయి. పంటలు వారం రోజుల నుండి నీటిలోనే ఉండంతో పూర్తిగా కుళ్లిపోయి దెబ్బతిన్నాయి. దాదాపు కొమ్మమూరు కాలువ కొత్తకాలువ పరిధిలో సుమారు 1500 ఎకరాల్లో నాట్లు వేశారు. ఎకరానికి ఈ పాటికే రూ.25 వేల పెట్టుబడి అయ్యిందని రైతులు తెలిపారు. పెట్టిన పెట్టుబడి ఒక్క రూపాయి కూడా తిరిగి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు కొత్త కాలువకు నాలుగు చోట్ల పెద్ద పెద్ద గండ్లు పడ్డాయి. దీంతో ఆ వరదనీటితో పాటు పక్కనే ఉన్న మురుగు కాలువ పూడికతో ఉండి వరదనీరు పోయే మార్గం లేక ఆ నీరంతా పొలాలపై ప్రవహించింది. పడిన గండ్లు వెంటనే పూడ్చకపోతే తిరిగి మరలా నాట్లు వేసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో మిర్చి పంట బయటపడినప్పటికీ నేల ఆరితే గానీ వాటి పరిస్థితి అర్థం కాదని రైతులంటున్నారు. మరలా అల్పపీడనం ఉందని చెప్పడంతో రైతులు అవికూడా దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉప్పుగుండూరులో కొత్త కాలువ పరిదిలో దెబ్బతిన్న మాగాణి భూములను కాలువలకు పడిన గండ్లను రైతుసంఘం, కౌలురైతు సంఘాల నాయకులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు, కౌలురైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె. మాబు మాట్లాడుతూ వాయుగుండం ప్రభావంతో రైతులు రెండు విధాలుగా నష్టపోయారన్నారు. ఒక పక్క వరదలతో పంటలన్నీ నీటమునిగి నేటికీ నీరు బయటకుపోక పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మరో పక్క కాలువలకు గండ్లు పడి నష్టపోయారన్నారు. జాతీయరహదారి నిర్మాణంలో డ్రైనేజీ సౌకర్యం కల్పించకపోవడంతో ఆ వరద నీరు పొలాలపై పడి ప్రతిసారీ రైతులు నష్టపోతున్నారని చెప్పారు. గత ఏడాది కూడా నష్టపోయారని చెప్పారు. మురుగు కాలువ పూడిక తీయాలని పలుమార్లు అధికారుల దష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. గండ్లను యుద్ధప్రాతికపదికన పూడ్చాలని, దెబ్బతిన్న పంటలను పూర్తిస్థాయిలో ఎన్యుమరేషన్ చేసి నష్టపరిహారం అందించి తిరిగి వ్యవసాయం చేయడానికి ఆర్థికసాయం, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు జి.బసవపున్నయ్య, కౌలురైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి టి.శ్రీకాంత్, రైతులు మాదాసు నాగేశ్వరరావు, పెంట్యాల వెంకటేశ్వర్లు, బెల్లం బాబురావు, నల్లూరి బాస్కరరావు, అత్తంటి సురేష్, బెల్లం వెంకటరత్నం, దేవరకొండ వెంకటేశ్వర్లు, నరేంద్ర, శాంతారావు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల

నివేదికలు సిద్ధం చేయండి

- 21, 22 తేదీల్లో కేంద్ర ఆరోగ్య బృందం పర్యటన
- ప్రోగ్రామ్ ఆఫీసర్స్‌కు డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఈనెల 21, 22 తేదీలలో కేంద్ర ఆరోగ్య బృందం పర్యటించనుందని, జాతీయ ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాల నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్‌ను ఆదేశించారు. శనివారం డిఎం,హెచ్‌ఒ ఛాంబర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో ప్రోగ్రాంఆఫీసర్స్ సమీక్షా సమావేశము నిర్వహించారు. డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది నిర్దేశించిన గ్రామం/ పట్టణంలోనే విధిగా నివాసం ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. అత్యవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిఐఒ డాక్టర్ పద్మజ, డిపిఎంఒ డాక్టర్ వాణిశ్రీ ఎంసిడి నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, మలేరియా అధికారి డాక్టర్ శ్రవణ్ పాల్గొన్నారు.

ఒకట్రెండు రోజుల్లో లిఫ్ట్‌లకు మరమ్మతులు

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాదేవి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని లిఫ్ట్‌లకు ఒకట్రెండు రోజులలో మరమ్మతులు పూర్తిచేస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాదేవి తెలియజేశారు. ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన 'జిజిహెచ్‌లో పనిచేయని లిఫ్ట్‌లు' కథనానికి సూపరింటెండెంట్ స్పందించారు. ఒంగోలు జిజిహెచ్‌లోని మూడు లిఫ్ట్ కోనే కంపెనీకి చెందినవని, కంపెనీతో వార్షిక నిర్వహణ ఒప్పందం ఉందన్నారు. లిఫ్ట్‌లకు సంబంధించి మరమ్మతులు కంపెనీ చేయాల్సి ఉందని, వారికి సమాచారం అందించామన్నారు. రోగుల సౌకర్యార్థం లిఫ్ట్ మరమ్మతులు ఒకటి, రెండు రోజులలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆ పరిమాణాలు మాత్రమే కొరత..

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ఐవి సరఫరాలో ఎలాంటి కొరత లేదని, ఐవి క్యానులా 18, 20 పరిమాణాలు మాత్రమే కొరత ఉన్నాయని చీమకుర్తి సిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.వేణుగోపాల్‌రెడ్డి, డిసిహెచ్‌ఎస్ సూరిబాబు పేర్కొన్నారు. ఈ నెల 18న ప్రజాశక్తి దినపత్రికలో 'చీమకుర్తి ఆసుపత్రిలో సెలైన్లూ కరువే..' శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించారు. చీమకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఆహారం అందించే విషయంలో టెండర్ ప్రక్రియలో జాప్యం జరగటం వల్ల ఆహారం అందించలేకపోతున్నట్లు తెలిపారు. 2022 నవంబర్ నుంచి ఆసుపత్రి 30 పడకల నుండి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినట్లు తెలిపారు. అయితే పూర్తిస్థాయిలో పడకలు సమకూరలేదని, అయినా రోగులకు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం గది నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఇంజనీర్ విభాగానికి పంపినట్లు చెప్పారు.



మాగుంటకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిడి

ఎంపీ మాగుంటను కలిసిన మైనింగ్ డిడి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని భూగర్భ, గనుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు రాంనగర్ 2వ లైన్‌లోని ఎంపి మాగుంట కార్యాలయంలో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలు చర్చించుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జియాలజిస్ట్ వర్మ, టెక్నికల్ అసిస్టెంట్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను

నిరంతరం పర్యవేక్షించాలి..

బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్



ఫెసిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కష్ణప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో రూ.5 లక్షల నిధులతో ఏర్పాటుచేసిన ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పార్లమెంట్ సభ్యులు శనివారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని పార్లమెంటు సభ్యులు చెప్పారు. జిల్లాలో జరుగుతున్న అభివద్ధి పనుల పురోగతిని ప్రజలకు తెలియపరచాలన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండడంతో వారి అభ్యున్నతికి కషి చేయాలన్నారు. ప్రతి ఏటా ఎంపీ ల్యాడ్స్ కింద పార్లమెంట్ నియోజకవర్గానికి రూ.5 కోట్ల నిధులు పార్లమెంట్ నుంచి విడుదలవుతాయన్నారు. వాటిని ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్న ప్రాంతాలలో అభివద్ధికి కేటాయిస్తామన్నారు. కేంద్రం నిధులను పర్యవేక్షించడానికి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు జరపాల్సి ఉందన్నారు. సమావేశంలో కలెక్టర్ జె వెంకట మురళి, జేసీ ప్రఖర్‌జైన్, శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, సిపిఓ శ్రీనివాసులు, ఆర్‌డిఓ పి.గ్లోరియా పాల్గొన్నారు.

మద్యం వ్యాపారుల సిండికేట్.!

రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రకాశం జిల్లాలో 171, బాపట్ల జిల్లాలో 117 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఈ మేరకు లైసెన్స్‌లు ఇవ్వడం జరిగింది. మద్యం షాపులను దక్కించుకునేందుకు దాదాపు అన్ని ప్రాంతాల్లో సిండికేట్ అయ్యారు. కొన్నిచోట్ల అధికారం అండగా సిండికేట్‌లు ఏర్పడగా మరి కొన్నిచోట్ల పాత లిక్కరు వ్యాపారులు, ఎన్‌ఆర్‌ఐల మద్దతుతో ఔత్సాహికులు కొందరు సిండికేట్ అయ్యారు. మద్యం దుకాణం కోసం ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకునే వెసులుబాటు కల్పించడంతో పాటు ఒక్కో షాపునకు రూ.2 లక్షలు చొప్పున నాన్ రిఫండబుల్ రుసుం చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించడంతో ఎక్కువ దుకాణాలు దక్కించుకునేందుకు సిండికేట్ అయిన వారు 50 నుంచి 100 దరఖాస్తుల వరకు దాఖలు చేశారు. కానీ లాటరీలో వారికి మూడు, నాలుగు షాపులు మించి రాలేదు. దీంతో పెట్టుబడి వ్యయమే రూ.లక్షల్లో అయినట్లయింది. తీరా షాపులు పెట్టే సమయంలో కొన్ని చోట్ల వివాదాలు తలెత్తాయి. తమ ప్రాంతాల్లో షాపు వద్దంటూ స్థానికుల అభ్యంతరాల నడుమ కొన్ని షాపులు ప్రారంభానికి నోచుకోలేదు. కాగా నూతనంగా వచ్చిన మద్యం షాపుల ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తెస్తామని, ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ఉంటాయని ప్రభుత్వం చెప్పింది గానీ ఆచరణలో చూస్తే కొత్త సీసాలో పాతసారా అన్న సామెతను గుర్తుకు తెస్తోంది. పాత సరుకే షాపులకు రావడంతో పాటు ధరలు కూడా గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా ఉన్నాయని చెబుతున్నారు. గతంలో మాదిరిగానే గ్రామాల్లో మద్యం దుకాణాలను అనుబంధంగా బెల్ట్ షాపులు పెడుతున్నారు.



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో సమావేశమయ్యారు. 125 రోజుల పాలనపై సమీక్ష చేశారు. అధికారపార్టీ నేతలు ఎవరూ కూడా ఇసుక అక్రమ అమ్మకాలు, రేషన్ బియ్యం అమ్మకాలు, మద్యం సిండికేట్ వ్యవహారాల జోలికి వెళ్లవద్దని హెచ్చరించారు. అందరి పనితీరు గమనిస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల్లో వ్యవహరిస్తున్న విధానాల గురించి సర్వేలు చేయనున్నట్లు చెప్పారు. పనితీరు మంచిగా లేకపోతే సహించేది లేదన్నారు. అయితే ప్రస్తుత అధికారపార్టీ నేతలు అత్యధికంగా గత పాలకుల మాదిరిగానే వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది. ప్రజాప్రతినిధులు నేరుగా కొందరు, తమ అనుచరుల ద్వారా కొంతమేర నియోజకవర్గాల్లో లోపాయికారి వ్యవహారాలు నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

ఈ వ్యవసాయ సీజన్‌లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన నాలుగు నెలల్లో బాపట్ల జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయింది. కురుస్తున్న వర్షాలు జిల్లాలోని కొంత ప్రాంత రైతాంగానికి మేలుగా ఉండగా మరికొందరు రైతులకు నష్టాన్ని కలుగజేస్తుంది. వర్షాల కారణంగా జిల్లాలోని వేమూరు, రేపల్లె నియోజకవర్గాల పరిధిలోని రైతులు పంటలను నష్టపోగా, చీరాల, పర్చూరు ప్రాంత రైతులకు మేలు జరిగింది. అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా కురిసిన వర్షాల కారణంగా ప్రకాశం జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో ఉన్న ఉప్పుకొటార్లు నీటమునిగాయి. మినుము, శనగ పంటలకు నష్టం జరిగింది. మరలా అల్పపీడన ప్రభావం కారణంగా వర్షాలు పడతాయని వెల్లడవుతున్న నేపథ్యంలో రైతులు అందోళనలో ఉన్నారు.

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ.20 వేల కోట్ల భారం మోపడం దుర్మార్గమని సిపిఎం నేతలు ఈ సందర్భంగా విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వరదలు, కరువు పరిస్థితులు వెంటాడుతున్నాయి. ఇలాంటి నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ఉపశమనం కలిగించకపోగా ప్రజల మీద భారం మోపటం అన్యాయమని తక్షణమే ప్రజలపై భారాలు మోపే విధానాలను మానుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది.

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను రాష్ట ప్రభుత్వం చేపట్టింది. ఆప్పటికే గ్రామసభల్లో గుర్తించిన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యాల పెంపుదల కోసం నిధులను మంజూరు చేయడం జరిగింది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా